నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, గురువారం 26 సెప్టెంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

3 లక్షల కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించి చూపాలి

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి సవాల్

యాదగిరిగుట్టలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డికి కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్25 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గత మూడేండ్ల కాలంలో రాష్ట్రంలో 3 లక్షల కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించే విధంగా చర్యలు తీసుకున్నారని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్ ఆ స్థాయిలో రెట్టింపు పంటలు పండించి చూపిస్తే పాలాభిషేకం చేస్తామని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సవాల్ విసిరారు. యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామిని బుధవారం ఆయన కుటుంబసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ఆలయ సంప్రదాయరీతిలో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ అధికారులు వారికి స్వామివారి ప్రసాదం అందజేశారు. అనంతరం మల్లారెడ్డి మీడియాతో మాట్లాడారు. దేశానికే అన్నంపెట్టే స్థాయికి తెలంగాణ రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ తీసుకువచ్చారని, ప్రపంచమే గర్వపడే విధంగా యాదగిరిగుట్ట దేవస్థానాన్ని మహాద్భుతంగా తీర్చిదిద్దారని అన్నారు. రైతు బంధు, రైతు బీమా ఇవ్వకుండా దాటవేసే ధోరణిలో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే గ్రూపుల పార్టీగా అభివర్ణించారు. రేవంత్‌రెడ్డిది ఒక గ్రూపు, భట్టి విక్రమార్క ది మరో గ్రూప్, ఒక్కో మంత్రిది ఒక గ్రూపుగా మారి రాజకీయాలను భ్రష్టుపట్టిస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ అంటే ఒకటే నని, ఒకటే కేసీఆర్, ఒకటే పరిపాలన అని తెలిపారు. పదేండ్ల కాలంలో రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ అద్భుతంగా తీర్చిదిద్దారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చక్కటి పరిపాలన చేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని హితవు పలికారు. అభివృద్ధిని పక్కనబెట్టి కేసీఆర్, కేటీఆర్‌ను తిట్టే పనిలో పడ్డారని విమర్శించారు. ప్రజలకు తప్పుదోవ పట్టించేందుకే హైడ్రాను తీసుకొచ్చారన్నారు. పేద ప్రజలపైనే హైడ్రా ప్రయోగాన్ని సంధించి వారిని తీవ్ర ఇబ్బంది పెట్టే పనిలో ఉన్నారని మండిపడ్డారు. తమ సంస్థలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంటే స్వచ్ఛందంగా తొలగిస్తామని వెల్లడించారు. రేవంత్‌రెడ్డి పాలనను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

11 మంది ఎస్ఐల బదిలీలు

నీలగిరి, సెప్టెంబర్ 25 : ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో పనిచేస్తున్న 11 మంది ఎస్ఐలను బదిలీ చేసినట్లు నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ బుధవారం రాత్రి తెలిపారు. నల్లగొండ డీఎస్‌బీలో ఉన్న వి.మహేశ్వర్‌ను సూర్యాపేట డీఎస్‌బీకి, వీఆర్‌లో ఉన్న వెంకటేశ్వర్లును కోదాడకు, డీసీఆర్‌బీలో ఉన్న ఎస్‌కే సైదులును కోదాడ టౌన్‌కు, మిర్యాలగూడ టూటౌన్‌లో ఉన్న కృష్ణయ్యను మాడ్గులపల్లికి, మాడ్గులపల్లిలో ఉన్న శోభన్ బాబును వీఆర్‌కు, డీసీఆర్‌బీ సూర్యాపేటలో ఉన్న వెంకటేశ్వర్లును వేములపల్లికి, వేములపల్లిలో ఉన్న విజయ్ కుమార్‌ను వీఆర్‌కు, సూర్యాపేట వన్ టౌన్‌లో ఉన్న లోకేశ్‌కుమార్‌ను మిర్యాలగూడ రూరల్-1కు, నల్లగొండ వన్ టౌన్‌లో ఉన్న సందీప్ రెడ్డిని మిర్యాలగూడ రూరల్ -2కు, మిర్యాలగూడ వన్ టౌన్‌లో ఉన్న శేఖర్‌ను అడవిదేవులపల్లికి, నల్లగొండ, సూర్యాపేట సీసీఎస్‌లో పనిచేస్తున్న సాయి ప్రశాంత్‌ను తిప్పర్తి ఎస్ఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు

అవినీతి, అరాచకాలను ఎండగడుదాం

మంత్రుల అడ్డగోలు వ్యవహారాలను ప్రజల్లోకి తీసుకువెళ్దాం

- త్వరలో నియోజకవర్గాల పర్యటనలు
- కార్యకర్తలకు భరోసా ఇస్తూ పార్టీ బలోపేతంపై దృష్టి
- ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతల భేటీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్25(నమస్తే తెలంగాణ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రభుత్వ వైఫల్యాలు, మంత్రుల వ్యవహార శైలి, అవినీతి, అరాచకాలు, ప్రజల్లో వ్యతిరేకతపై పోరాటాలతోపాటు బీఆర్ఎస్ కేడర్‌లో జోష్ నింపే దిశగా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నివాసంలో జరిగిన ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు తీరు, ప్రజల్లో జరుగుతున్న చర్చ, వ్యతిరేకత, పార్టీ పరిస్థితి, చేపట్టాల్సిన కార్యక్రమాలు తదితర అంశాలపైనా విస్తృతంగా చర్చించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో జిల్లా ముఖ్య నేతలంతా తాజా పరిస్థితిని కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నల్లగొండ జిల్లాలో తిరిగి మళ్లీ ఫ్లోరైడ్ ఆనవాళ్లు తెరపైకి వచ్చాయని కేటీఆర్‌కు వివరించారు. జిల్లాలో కాంగ్రెస్ నేతల అవినీతి, అరాచకాలకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నదని, ముఖ్యంగా మంత్రుల సపోర్ట్‌తో అధికార పార్టీ నేతలు ప్రజలను ఏ విధంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారో నియోజకవర్గాల వారీగా వివరించారు. జిల్లాలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి అడ్డగోలుగా వ్యవహరిస్తుండడంతో ప్రజల్లోనూ వ్యతిరేకత మొదలైందని చెప్పారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, యాదాద్రి మాజీ జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, గాదరి కిశోర్‌కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, చిరుమర్తి లింగయ్య, నోముల భగత్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, నలమోతు భాస్కర్‌రావు, ఉమ్మడి జిల్లా ముఖ్య నేతలు

త్వరలో క్షేత్రస్థాయి పర్యటనలు

జిల్లా నేతల నుంచి వివరాల సేకరణ అనంతరం కేటీఆర్ స్పందిస్తూ మంత్రుల అవినీతి, అరాచకాలను ఎండగడుదామని పిలుపునిచ్చారు. అధికార దర్పం, అహంకారంతో మంత్రులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నట్లు విమర్శించారు. మంత్రులతోపాటు కాంగ్రెస్ నేతల అక్రమాలను, దౌర్జన్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలతోపాటు జిల్లాకు సంబంధించిన స్థానిక అంశాలపైనా మరింత చురుగ్గా ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధం కావాలని కేటీఆర్ సూచించారు. ఇంకా జిల్లా పరిధిలో ప్రభుత్వాన్ని నిలదీసే అంశాలపైనా పార్టీ నేతలతో కేటీఆర్ చర్చించారు. కాంగ్రెస్ పార్టీ అరాచకాలపై త్వరలోనే జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో పర్యటించి ప్రజలకు వివరిద్దామని నిర్ణయించారు.

బీఆర్ఎస్ బలోపేతం పైనా...

ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపైనా నేతలతో కేటీఆర్ విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలు, ముందుకు తీసుకువెళ్లాల్సిన అంశాలపైనా కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. పార్టీ క్యాడర్‌కు భరోసానిస్తూ మరింత బలోపేతం చేసేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. రానున్న కాలంలో ప్రభుత్వంపై ప్రజల్లో మరింత వ్యతిరేకత రావడం ఖాయమని, అందుకు అనుగుణంగా పార్టీ కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు.

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన భేటీలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్యయాదవ్, రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కంచర్ల భూపాల్ రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, నోముల భగత్, బూడిద భిక్షమయ్యగౌడ్, మాజీ జడ్పీ చైర్మన్లు బండ నరేందర్ రెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సోమ భరత్‌కుమార్, కంచర్ల కృష్ణారెడ్డి, ఒంటెద్దు నర్సింహారెడ్డి, నంద్యాల దయాకర్‌రెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- వారంలో పారిశుధ్యం మెరుగుపర్చకుంటే చర్యలు
- కలెక్టర్ హనుమంతు కే జెండగే
- రామన్నపేట ప్రభుత్వ దవాఖాన ఆకస్మిక తనిఖీ
- రేడియాలజిస్ట్ లేక అవస్థ పడుతున్నామని గర్భిణుల ఆవేదన

దవాఖానలో గర్భిణులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

రామన్నపేట, ఆగస్టు 25: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని కలెక్టర్ హనుమంతు కే జెండగే వైద్యులను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఆస్పత్రిలోని ప్రతి వార్డు, ప్రతి విభాగానికి వెళ్లి దాదాపు రెండు గంటలపాటు పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. ఏ గ్రామం నుంచి వచ్చారు, ఎన్ని రోజులు అయ్యింది, వైద్య సేవలు ఎలా ఉన్నాయి, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అనేది తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. డాక్టర్లు, వైద్య సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చారు. రేడియాలజిస్ట్ లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నామని గర్భిణులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, త్వరలోనే గైనకాలజిస్ట్, రేడియాలజిస్ట్‌ను నియమిస్తామని తెలిపారు. ఆస్పత్రిలోని మరుగుదొడ్లు, పరిశుభ్రతను పరిశీలించి వారం రోజుల్లో పారిశుధ్యం మెరుగు పరిచేలా కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇవ్వాలని, చేయని పక్షంలో చర్యలు తీసుకోవాలని డీసీహెచ్ఎస్‌ను ఆదేశించారు. ఆస్పత్రికి అవసరమైతే సీఎస్ఆర్ నిధులను మంజూరు చేస్తామన్నారు. దవాఖాన మెయిన్ గేట్ వద్ద ఆగుతున్న వాన నీటిని చూసి ఇంజినీర్ అధికారుల సూచనలతో పనులు చేయించాలని ఎంపీడీఓను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా దవాఖానల కో ఆర్డినేటర్ చిన్నా నాయక్, ఇన్‌చార్జి సూపరిండెంట్ ఈశ్వర్, తాసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ యాకూబ్‌నాయక్, వైద్యులు ఈశ్వర్, నాగేశ్వరరావు, లింగాయాదవ్, మాధవచారి, వరుణ్‌రెడ్డి, ద్విజ ఉన్నారు.

100 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని వినతి

రామన్నపేట ప్రభుత్వ దవాఖానాను 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని కలెక్టర్‌కు సీపీఎం నాయకులు మేక అశోక్‌రెడ్డి, జెల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, మునుకుంట్ల లెనిన్, కందుల హన్మంతు వినతిపత్రం అందజేశారు. నూతన భవనం నిర్మించి వైద్యుల ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. దవాఖాన పారిశుధ్య కార్మికులు కాంట్రాక్టర్ జీతాలు సరిగ్గా ఇవ్వడం లేదని ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని ఫిర్యాదు చేశారు.

పాలనలో 'పంచాయితీ'

సామూహిక సెలవుల్లో కార్యదర్శులు, ఎంపీఓలు, ఎంపీడీఓలు

- నిధుల లేమి, పని ఒత్తిడి, ఇతర విభాగాల పెత్తనంపై ఆగ్రహం
- అకారణ సస్పెన్షన్లను ఎత్తివేయాలని డిమాండ్
- డిమాండ్లు నెరవేర్చే వరకు విధులకు దూరమని ప్రకటన
- చర్చలు జరుపుతున్నాం : స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

గుర్రంపోడ్ ఎంపీడీఓ కార్యాలయం అధికారికి సామూహిక సెలవు పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నల్లగొండ జిల్లాలో పంచాయతీ విభాగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు సంచలనంగా మారాయి. జిల్లా ఉన్నతాధికారులకు, ఆ శాఖలోని అధికారులు, సిబ్బందికి మధ్య కొంతకాలంగా నివురుగప్పిన నిప్పులా ఉన్న వివాదం తాజాగా పలువురి సస్పెన్షన్లతో రచ్చకెక్కింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి గ్రామపంచాయతీలు, మండల పరిషత్‌లకు నిధులు రాలేదు. ముఖ్యంగా పంచాయతీలు, మండల పరిషత్‌లలో ప్రత్యేక అధికారుల పాలన మొదలైన నాటి నుంచి ప్రభుత్వం నిధులు ఇవ్వకున్నా సొంత డబ్బులతో నెట్టుకొస్తున్నామని, తీవ్ర పని ఒత్తిళ్లను తట్టుకుని ప్రభుత్వ లక్ష్యాల కోసం కృషి చేస్తున్నామని పంచాయతీ విభాగం అధికారులు పేర్కొంటున్నారు. అయినా జిల్లా ఉన్నతాధికారులు టార్గెట్లు విధిస్తూ, పర్యవేక్షణ పేరుతో ఇతర శాఖల అధికారులకు పెత్తనం అప్పగిస్తున్నారని, చిన్నచిన్న కారణాలకే స్సస్పెండ్ చేస్తూ మానసిక ఆందోళనకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ మూకుమ్మడి సెలవులకు దిగారు. బుధవారం పంచాయతీ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారులు, ఎంపీడీఓలు వేర్వేరుగా తామంతా సామూహిక సెలవులో వెళ్తున్నట్లు జిల్లా కలెక్టర్ అడ్రెస్‌తో వినతిపత్రాలు సమర్పించి విధులను బహిష్కరించారు. ఈ పరిణామాలు జిల్లాలో కలకలం రేపుతున్నాయి.

– నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్25(నమస్తే తెలంగాణ)/నీలగిరి

ఇతర కారణాలతో ఉన్నతాధికారులు ఇబ్బందులు గురి చేస్తున్నారని కార్యదర్శులు సంచలన నిర్ణయానికి వచ్చారు. జిల్లాలోని గుర్రంపోడ్ ఎంపీడీఓ, మరో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ సస్పెండ్ చేయడంతో ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవుకు వెళ్లారు. ఆ మేరకు బుధవారం జిల్లా అంతటా సెలవులు పెడుతూ సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు లేఖలు ఇచ్చారు. జిల్లాలో స్థానిక ప్రజాప్రతినిధుల పదవి కాలం ముగిసిపోవడంతో పల్లెల్లో పరిపాలన సౌలభ్యం కోసం ఇతర శాఖల అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. అంతేగాక క్షేత్రస్థాయిలో పనులు సక్రమంగా జరిగేందుకు, వాటిని తనిఖీలు చేసేందుకు ఇతర శాఖలకు సంబంధించిన అధికారులను మండల సూపర్‌వైజరీ అధికారులను నియమించి ఎప్పటికప్పుడు పల్లెల్లో పాలనపై జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ చేస్తున్నది. గ్రామాల్లో పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీరు, మొక్కల పెంపకం, కంపోస్ట్ షెడ్ నిర్వహణ వంటి కారణాలను ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా జిల్లాలో క్షేత్రస్థాయి పాలన వ్యవహారాల్లో కీలకమైన గ్రామ, మండల పరిషత్ విభాగంలో 9 నెలలుగా నిధుల రాక అధికారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అక్కడక్కడా కొంత మంది అధికారులు సొంత నిధులు వెచ్చించి విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నారంటూ గుర్రంపోడ్ ఎంపీడీఓ, విధులకు హాజరు కాని పులిచర్ల పంచాయతీ కార్యదర్శి, పారిశుధ్యం క్రిమిటోరియం సక్రమంగా లేదని వాచ్యాతండా కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ఉన్నతాధికారులు తమ పట్ల వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులంతా బుధవారం నుంచి సామూహిక సెలవుల్లోకి వెళ్లారు. ఇందుకు సంబంధించి వేర్వురుగా ఆయా సంఘాల జేఏసీల ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌కు తమ సామూహిక సెలవుల వినతిపత్రాలను అందజేశారు. దాంతో జిల్లావ్యాప్తంగా గ్రామాలు, మండలాల్లో పాలన వ్యవస్థ స్తంభించింది. వర్షాలు పడుతున్న వేళ సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండగా జిల్లా ఉన్నతాధికారులు, పంచాయతీ విభాగం అధికారులకు మధ్య తలెత్తిన వివాదం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. కాగా, అప్పటికే వచ్చిన ఆదేశాల మేరకు బుధవారం నుంచి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మూడు రోజుల పాటు మహారాష్ట్ర పర్యటనలో ఉండడం గమనార్హం.

సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శుల జేఏసీ నేతలు

ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రత్యేకాధికారుల పాలన మొదలైంది. అప్పటి నుంచి గ్రామపంచాయతీలకు నిధులు రాలేదని, అయినా నిర్వహణ తామే చేపడుతున్నామని పంచాయతీ కార్యదర్శుల జేఏసీ నేతలు పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాక పోవడంతో తామే అప్పులు చేసి తాగునీటితో పాటు పారిశుధ్య చర్యలు, వీధిదీపాల నిర్వహణ చేపడుతున్నట్లు తెలిపారు. తమకు రావాల్సిన డబ్బులను తక్షణమే చెల్లించాలని కోరారు. బీఎల్ఓలు నిర్వర్తించాల్సిన విధులను సైతం తమతో చేయించడం సరికాదంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన హరితహారం మొక్కల లెక్కల వివరాలపై ఇప్పుడు ఆరా తీయడమంటే తమను బ్లాక్‌మెయిల్ చేయడమేనని చెప్తున్నారు. ఇలా పలు రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తూ అకారణంగా సస్పెన్షన్ వేటు వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తమ బిల్లులతో పాటు పని ఒత్తిడి తగ్గించాలని, అకారణంగా సస్పెండ్ చేసిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సామూహిక సెలవుల్లో వెళ్తున్నట్లు అన్ని మండలాల్లో ఎంపీడీఓలకు కార్యదర్శుల జేఏసీ లేఖలను అందజేసింది. ఇదే సమయంలో మండల పంచాయతీ అధికారులు సైతం నిధులు లేకున్నా సాధ్యమైంత వరకు ప్రజలకు సేవ లందించేందుకు కృషి చేస్తున్నామని, అయినా ఉన్నతాధికారులు వివిధ రకాలుగా ఒత్తిడికి గురిచేస్తున్నారంటూ సామూహిక సెలవు పెట్టారు. తక్షణమే తమ విభాగంలో సస్పెన్షన్లను ఎత్తివేయాలని, తమపై ఇతర శాఖల అధికారుల పర్యవేక్షణను తొలగించాలని, నిధులు విడుదల చేస్తూ పని ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఎంపీడీఓ సంఘం ఆధ్వర్వంలోనూ సామూహిక సెలవు కోరుతూ కలెక్టర్‌కు లేఖ పంపించారు. గ్రామ పంచాయతీల్లో నిధుల లేమి, పని ఒత్తిడి, అకారణ సస్పెన్షన్ల ఎత్తివేత, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం డిమాండ్లతో నిరసనకు దిగారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు విధులకు హాజరుకాకూడదని నిర్ణయించారు.

చర్చలు జరుపుతున్నాం

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై జిల్లా యంత్రాంగం క్రమ శిక్షణ చర్యలు తీసుకోవడం సహజం. జిల్లాలో పరిపాలన సౌలభ్యం కోసం రెండు వారాల క్రితం మండల సూపర్‌వైజరీ అధికారులను నియమించి పల్లెలో సమస్యలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం. కానీ ఇతర శాఖల అధికారుల ఒత్తిడి అంటూ పంచాయతీ విభాగం అధికారులు, సిబ్బంది సామూహిక సెలవులు పెట్టారు. దీనిపై సంబంధిత సంఘాల నాయకులతో చర్చలు జరుపుతున్నాం. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారి డిమాండ్లను జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

- పూర్ణచంద్ర, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

గంధమల్ల చెరువు వద్ద పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

మూడు నెలల్లో గంధమల్ల రిజర్వాయర్ పనులు ప్రారంభం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- గంధమల్ల చెరువు అలుగు వద్ద పూజలు

తుర్కపల్లి, సెప్టెంబర్ 25 : వచ్చే మూడు నెలల్లో 1.4 టీఎంసీల సామర్థ్యంతో గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణ పనులను ప్రారంభిస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. మండలంలోని గంధమల్ల చెరువు నిండి అలుగు పోస్తుండడంతో బుధవారం ఆయన చెరువును సందర్శించి అలుగు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తామన్నారు. రాజాపేట, ఆలేరు మండలాల్లోని చెరువులు నింపాలనే లక్ష్యంతో మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయించి గంధమల్ల చెరువును నింపామన్నారు. ఈ చెరువు నిం డడం ద్వారా నియోజకవర్గంలోని అనేక గొలుసుకట్టు చెరువులకు నీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య, మాజీ చైర్మన్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి ఉన్నారు.